https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 62 ఆదివారం 5-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్



**న్యూఢిల్లీ, జూలై 4 :**
జమ్మూకశ్మీర్‌లో తాజాగా ఎన్‌కౌంటర్ మొదలైంది . శనివారం షోపియన్ జిల్లాలో ఉగ్రవాద ఏరివేత చర్యలు చేపడుతున్న భద్రతా దళాలపై టెర్రరిస్టులు కాల్పులకు దిగారు. తొలుత పోలీసులు ఛానాపోరా, సైద్‌పోరా, అమ్షిపోరా, పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఉగ్రవాదులు దాగున్నారన్న సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో పోలీసులు కూడా ప్రతిదాడికి దిగారు. ప్రస్తుతం అదనపు భద్రతాదళాలు కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే, మొత్తం ఎంత మంది ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో దాగున్నారో ఇంకా తెలియ రాలేదు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## టీఆర్ఎస్ పేరు ఇవ్వలేం

**కవిత కు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ**

**హైదరాబాద్, జూలై 4**



కొత్త రాజకీయ పార్టీతో తెలంగాణలో సత్తా చాటాలని భావిస్తున్న తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) షాకిచ్చింది. 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త పేరుపై తమకు అనేక అభ్యంతరాలు వచ్చాయని, అందువల్లఆ పార్టీ పేరును కేటాయించలేమని ఆమెకు ఇటీవల ఈసీ లేఖ రాసింది. ప్రత్యామ్నాయంగా 3పేర్లు పంపించాలని సూచించింది. ఆ లేఖకు కవిత సమాధానం కూడా ఇచ్చినట్లు సమాచారం. కవితకు తెలంగాణ రక్షణ సేన పేరును కేటాయించడంపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అని ఈసీ కొంతకాలం క్రితం బహిరంగ ప్రకటన ఇచ్చింది. అప్పట్లో రెండు అభ్యంతరాలు వచ్చాయి. ఒకటి సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన ఒక మాజీ జడ్పీటీసీ నుంచి వచ్చింది.

మిగతా 2లో...

# కేసీఆర్‌కు అధికారం గతమే

## ఎమ్మెల్యేగా రాడట.. అధికారంతో దోచుకోవడానికి వస్తాడట

**పదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దోపిడీ చేశారు.. వారితో కలిసి పనిచేసిన అధికారుల వద్ద వందల కోట్లు దొరుకుతున్నాయి**

**లక్ష కోట్ల ఆస్తులు.. వెయ్యి ఎకరాల ఫాంహౌస్ ఎలా వచ్చాయి?**

**రాష్ట్రానికి రూ.8.21 లక్షల కోట్ల అప్పులు ఎలా అయ్యాయి?**


**ప్రజాప్రభుత్వం ఎందుకు పోవాలి? వారు ఎందుకు రావాలి?**

**రాహుల్‌ను ప్రధానిని చేయాలంటే మళ్లీ నేను సీఎం కావాలి**

**మిడ్జిల్‌లో 20 ఏళ్ల రాజకీయ ప్రస్థాన కృతజ్ఞత సభలో రేవంత్**

**మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**






**మహబూబ్‌నగర్, జూలై 4**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి కేసీఆర్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడమన్నది కలేనని, ఆయనకు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని అన్నారు. కేసీఆర్ భవిష్యత్తుకు తెలంగాణ ప్రజలు శాశ్వతంగా ముగింపు పలికారని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వారితో కలిసి దోపిడీ చేసిన అధికారుల వద్ద రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు ఏసీబీకి దొరుకుతున్నాయని, ఇదంతా తెలంగాణ ప్రజల వద్ద దోచుకున్నదేనని తెలిపారు. "కేసీఆర్‌కు గజ్వేల్, ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల ఫాంహౌస్ ఎక్కడి నుంచి వచ్చింది? ఆయన తాత, ముత్తాతలు ఇచ్చారా? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను దోచుకుంటే వచ్చింది. ఆయన కొడుక్కి జన్వాడలో వంద ఎకరాల ఫాంహౌస్, అల్లుడు హరీశ్‌రావుకు మొయినాబాద్‌లో 50 ఎకరాల ఫాంహౌస్, బిడ్డ కవితకు శంకరపల్లిలో పాతిక ఎకరాల ఫాంహౌస్ ఎక్కడి నుంచి వచ్చాయి? సడ్డకుడి కొడుకు సంతోష్ రావు లెక్కలైతే చెప్పేట్లు లేవు. వజ్ర వైడూర్యాలు, బెంజ్ కార్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఏం వ్యాపారం చేశారు?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం తన రాజకీయ ప్రస్థానంలో 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. తనను తొలిసారిగా జడ్పీటీసీగా గెలిపించి రాజకీయ జన్మనిచ్చిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో సీఎం పర్యటించారు. ముందుగా నాగర్‌కర్నూలు జిల్లా ఉర్కొండపేట మండలంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి అక్కడే సహపంక్తి భోజనానికి వచ్చిన ఆత్మీయులతో కలిసి మాట్లాడారు. అనంతరం మిడ్జిల్ చేరుకొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ జడ్పీచైర్మన్ ద్యాప గోపాల్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కృతజ్ఞత సభలో మాట్లాడారు. "గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రజలు కేసీఆర్ ఉద్యోగం ఇస్తే అసెంబ్లీకి మాత్రం రారట.. ప్రజల తరపున మాట్లాడరట.. ప్రజా సమస్యలను ప్రస్తావించరట. అధికారంలోకి మాత్రం దోచుకోవడానికి వస్తారట.. దొంగతనం చేయడానికి వస్తారట. నీకు అధికారం అనేది కలలో మాట" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లు అధికారం ఇస్తే ఇసుక దోపిడీకి అడ్డంపడ్డ నేరెళ్ల దళితులను లారీలు పెట్టి తొక్కించారని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మం జిల్లాలో గిరిజనులకు బేడీలు వేసి జైలుకు తీసుకెళ్లారని సీఎం రేవంత్ ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా ప్రశ్నపత్రాలను పల్లీ బఠానీల్లా అమ్ముకున్నారని, వందల కోట్లు కొల్లగొట్టి నీళ్లు ఇవ్వలేదని, పింఛన్లు ఇవ్వలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కుటుంబ సభ్యులను, చుట్టాలను, కావాల్సి నోళ్లను మంత్రులను చేసుకున్నారని, ఓడిపోతే ప్రభుత్వ సలహాదారులను చేసుకున్నారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో లక్షల కోట్లు దోచుకొని సంక్షేమ పాలన అందిస్తున్న ప్రజాప్రభుత్వం పోవాలని గుండెలు బాదుకుంటూ తాపత్రయ పడుతున్నారని మండిపడ్డారు. చూపించుకోవడానికి టీవీ, రాసుకోవడానికి పేపర్, అబద్ధాలు చెప్పడానికి భజనపరులను ఇచ్చినందుకు ఆ పాపాల భైరవుడిని రావాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో...

## హిందువుల ఓట్లను తొలగించే కుట్ర

**సర్ పేరిట రాష్ట్ర సర్కారు అధికార దుర్వినియోగం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



2

## ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేయండి

**కలెక్టర్లకు**

**సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు**



2

## అమ్మా.. ఎక్కడున్నావ్?

కూలీ పనికి వెళ్లి తల్లి మిస్సింగ్

25 రోజులుగా అల్లాడుతున్న ఇద్దరు కూతుళ్లు

తండ్రి కూడా లేకపోవటంతో ఎవరిని అడగాలో తెలియక కన్నీళ్లు

బషీరాబాద్ పీఎస్‌లో కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు



# భట్టి రంకెలేస్తే అంకెలు మారవు

## 31 నెలల్లో రేవంత్ చేసిన అప్పు రూ.4.5 లక్షల కోట్లు

**బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు**

**మేం 8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి కట్టుకథలు**

**ప్రభుత్వ పెద్దలు లంచాలిచ్చి అప్పులు తెస్తున్నారు**

**10 వేల కోట్లకు 170 కోట్లు బ్రోకరేజ్ చార్జీ ఇచ్చారు**

**బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపణ**



**హైదరాబాద్, జూలై 4**
ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల విషయంలో భట్టి అబద్ధాలు, అర్ధసత్యాలు చెబుతున్నారని ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.8,21,651 కోట్లు అని భట్టి కట్టుకథలు చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికే ఉన్న ఎఫ్ఆర్‌బీఎం, ఎస్‌పీవీఎస్ గ్యారెంటీ రుణాలు కలిపి రూ.84,268 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో చూపారని చెప్పారు. తాము లేని లెక్కలు చెప్పట్లేదని, శుక్రవారం భట్టి విలేకరుల సమావేశంలో చూపిన పత్రాల్లో ఉన్న లెక్కలే చెబుతున్నామని అన్నారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.15,118 కోట్లు. దీన్ని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పుల్లో కలిపారు. అంటే రూ.84,268 కోట్లుంరూ.15,118 కోట్లు కలిపి రూ.99,386 కోట్లు. ఈ మొత్తాన్ని 2023 డిసెంబరు 7 నాటికి ప్రభుత్వంపై ఉన్న రుణ బకాయిలు రూ.5,16,881 కోట్ల నుంచి తీసివేస్తే రూ.4,17,495 కోట్ల అప్పు ఉంటుంది. భట్టి లెక్కల ప్రకారం ఎన్ని కలిపినా కాంగ్రెస్ వాళ్లు చెప్పిన రూ.8,21,651 కోట్లు రావట్లేదని, అందులో ఏం ఏం కలిపారో వారే చూసుకోవాల"ని హరీశ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు దాటలేదన్న మాటకు కట్టుబడి ఉంటానని, చర్చకు ఎప్పుడైనా సిద్ధమన్నారు. లేని అప్పులను ఉన్నట్లు చూపి గోబెల్స్ ప్రచారానికి పాల్పడుతున్నారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.6,71,757 కోట్లు అని చెప్పిందని, ఇందులో కూడా తమకు సంబంధం లేనివి కలిపారన్నారు. శుక్రవారం భట్టి మాట్లాడుతూ రూ.లక్షా 77వేల కోట్ల అప్పు తెచ్చినట్లు చెప్పారని, సీఎం రేవంత్ మార్చి 18న అసెంబ్లీలో మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నాటికి కాంగ్రెస్ చేసిన అప్పులు రూ.3,47,294 కోట్లు అని ప్రకటించారని చెప్పారు. 4 నెలల్లో అప్పులు ఎలా తగ్గాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కరెక్టా? భట్టి కరెక్టా? చెప్పాలన్నారు.

# మమతకు మరో షాక్..

**రాజీనామా చేసిన పార్టీ ప్రెసిడెంట్ చంద్రిమా భట్టాచార్య**



**కోల్‌కతా, జులై 4:**
తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పార్టీకి చెందిన కీలక నేతలు పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేశారు. మరి కొందరు రెబల్స్‌గా మారి పార్టీని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి సమయంలో మమతకు ఊహించని షాక్ తగిలింది. సీనియర్ నేత చంద్రిమా భట్టాచార్య టీఎంసీ పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్ పదవికి శనివారం రాజీనామా చేశారు. అంతేకాదు.. పార్టీలో తనకు కేటాయించిన అన్ని పదవులకు కూడా ఆమె రాజీనామా చేశారు. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాత కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే చంద్రిమా భట్టాచార్యను జూన్ మొదటి వారంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఆమె తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

మిగతా 2లో...

# న్యాయమూర్తుల ఓట్లు పోతే కానీ సమస్య తీరదు

**సర్‌పై సుప్రీం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి**

**సుప్రీం ఇచ్చిన తీర్పులో అన్వయలోపం ఉందని వ్యాఖ్య**



**హైదరాబాద్ సిటీ, జూలై4:**
దేశంలోని సివిల్ సర్వీసెస్ అధికారులు, న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు తమ ఓటు హక్కు కోల్పోతే కానీ సర్ వల్ల ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం లభించదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. సర్ ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును విమర్శించారు. తెలంగాణ ఓటర్ల హక్కుల వేదిక ఆధ్వర్యంలో 'సర్ ప్రక్రియ – ఓటు హక్కు పరిరక్షణ, ప్రజల డిమాండ్లు' అనే అంశంపై జరిగిన సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1950, సెక్షన్21(3) ప్రకారం ఏదైనా(ఎనీ) నియోజకవర్గంలో లేదా అందులోని వార్డుల్లో ఓటర్ల జాబితా సవరణ చేపట్టచ్చు అని ఉంటే, దాన్ని అన్ని(ఆల్) నియోజకవర్గాల్లో నిర్వహించవచ్చు అన్నట్టుగా సుప్రీంకోర్టు తీర్పులో తప్పుగా అన్వయించిందని ఆరోపించారు. అదే సెక్షన్‌లో స్పెషల్ రివిజన్ అని మాత్రమే ఉండగా దానిని స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్‌గా మార్చారని ఆక్షేపించారు. బూత్‌లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో) తనకు దరఖాస్తు ఫారం ఇచ్చారని, ఏ చిన్న పొరపాటు దొర్లినా ఓటు హక్కు పోతుందనే భయంతో ఇంతవరకు ఆ కాగితం నింపలేదని తెలిపారు. ప్రజాస్వామ్యం లో ఓటర్లు పాలకులను ఎన్నుకోవాలి గానీ పాలకులే ఓటర్లను ఎంచుకుంటున్నారా? అనే సందేహం కలుగుతుందన్నారు. సర్ ప్రక్రియలోని ప్రమాదాన్ని గుర్తించి రాహుల్‌గాంధీ మాట్లాడినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఇక, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ సర్‌ను మొదట కేవలం రోహింగ్యాలకు సంబంధించిన అంశం గా భావించినప్పటికీ ఇప్పుడు అది ప్రజలం దరినీ ఆందోళనలోకి నెట్టేసిందని పేర్కొన్నారు.

# రౌడీ రాజకీయం..

- నేరస్థులతో సమాజానికి నష్టం
- రెండేళ్లలో నా రాజకీయ జీవితానికి 50 ఏళ్లు
- ఈ వయసులోనూ రౌడీలు, మాఫియాతో రాజకీయాలు చేయాల్సి రావడం బాధాకరం
- రౌడీలు రాజకీయాల్లోకి రావడం వల్లే వివేకా హత్య, కోడికత్తి డ్రామా
- రాజధానిపై జగన్‌ది రోజుకొక మాట
- ఇక్కడా గోల్డ్‌ఫీల్డ్స్.. స్వర్ణ కుప్పంగా మారుస్తా
- కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబు



**కుప్పం, జూలై 4**
"ప్రజల విషయంలో నేను సౌమ్యుడినే. సంఘ విద్రోహ శక్తుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మరో రెండేళ్లలో తన రాజకీయ జీవితానికి 50 ఏళ్లు నిండుతాయని, ఇలాంటి సమయంలో కూడా రౌడీలు, మాఫియాలతో రాజకీయాలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. నేరస్థులతో సమాజానికి తీరని నష్టం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండో రోజు శనివారం కుప్పం పర్యటనలో భాగంగా ఆయన రూ.118 కోట్లతో నిర్మించనున్న కుప్పం ఆర్టీసీ బస్టాండు, డిపోకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. "రౌడీలు రాజకీయాల్లోకి వచ్చినందువల్లే వైఎస్ వివేకానంద హత్య జరిగింది. కోడికత్తి డ్రామా నడిచింది. వాటికి నాడు నన్ను బాధ్యుణ్ణి చేశారు. మాస్క్ అడిగిన డాక్టర్‌ను చనిపోయేలా చేశారు. డ్రైవర్‌ను కారు డిక్కీలో పెట్టి డోర్ డెలివరీ చేశారు" అని సీఎం మండిపడ్డారు. రాజధాని విషయంలో ప్రతి రోజూ కొత్త మాటలు మాట్లాడుతున్నారని వైసీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి ఆగ్రహించారు.

మిగతా 2లో...

# కేసీఆర్‌కు అధికారం గతమే... (మొదటిపేజీ తరువాయి)

ప్రజాపాలన ఎందుకు పోవాలో, ఫాంహౌస్‌లో బందీ అయిన పాపాల భైరవుడు ఎందుకు రావాలో ప్రజలు ప్రతిచోటా చర్చ పెట్టాలని సీఎం రేవంత్ అన్నారు. "రేషన్ కార్డు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? సన్నబియ్యం పెట్టినందుకు పోవాలా? ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు పోవాలా? ఉచిత కరెంటు ఇచ్చినందుకు పోవాలా? రైతు రుణమాఫీ చేసినందుకు పోవాలా? రైతు భరోసా వేసినందుకు పోవాలా? వరి వేస్తే ఉరి వేసుకున్నట్లని ఆ దుర్మార్గుడు చెబితే.. 2.88 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండిస్తే చివరి గింజ వరకు కొని రూ. 80 వేల కోట్లు రైతులకు ఇచ్చినందుకు పోవాలా? డ్రగ్స్, గంజాయి అమ్మేవారిని పట్టుకొని బొక్కల పెట్టి, మక్కెలిరగ కొట్టినందుకు పోవాలా? మీరొస్తే ఏం చేస్తరు? ఫాంహచి?సలలో అమ్మిన గంజాయి, డ్రగ్స్‌ను రైతు బజారులో పెట్టి అమ్ముతారా?" అని రేవంత్ ధ్వజమెత్తారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం, ప్రజలకు సేవ చేస్తున్న ప్రభుత్వం పోవాలనడానికి వారి సంపాదన, దోపిడీ, దొంగతనాలు ఆగిపోవడమే కారణమని ఆరోపించారు. గతంలో ఆడబిడ్డలకు ఇచ్చిన బతుకమ్మ చీరల్లో కూడా కమీషన్లు కొట్టేశారని తెలిపారు. కేసీఆర్ లక్ష కోట్లు ఎలా సంపాదించారో, రాష్ట్రానికి రూ.8.21 లక్షల కోట్ల అప్పు ఎలా మిగిలిందో యువకులు, జెన్‌జీ పిల్లలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల ఫోన్లు కూడా విన్నవారిని మళ్లీ రానివ్వాలా? అని మండిపడ్డారు. రాహుల్ ప్రధానమంత్రి కావడం చారిత్రక అవసరమని రేవంత్ అన్నారు. తనను సీఎం చేసిన రాహుల్‌ను పీఎం చేయాలంటే తాను 2029లో మళ్లీ గెలవాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా రేవంత్ అందిస్తున్నది నిజమైన ప్రజాపాలన అని తెలిపారు . మిడ్జిల్ తన సొంత ప్రాంతం కాకపోయినా.. 20 ఏళ్ల క్రితం తాను స్వతంత్ర అభ్యర్థిగా నిలబడితే ప్రజలు జడ్పీటీసీగా గెలిపించారని సీఎం రేవంత్ అన్నారు. అప్పుడు వారు నాటిన మొక్క నేడు వృక్షమై ఎందరికో నీడనిచ్చే స్థాయికి ఎదిగానని, ఇప్పుడు రాష్ట్రంలో అత్యున్నత పదవిలో ఉన్నప్పుడు వారికి కరువు లేకుండా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకొని.. అభివృద్ధి, సంక్షేమం బాధ్యతలను స్వయంగా పర్యవేక్షించాలని డిప్యూటీ సీఎం భట్టికి సూచించారు. శనివారం సీఎం పర్యటన సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామానికి రూ.50 లక్షల చొప్పున రూ.80 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయానికి రూ.11.5కోట్ల నిధులు మంజూరు చేశారు. మరోవైపు ఆనాడు మిడ్జిల్ జడ్పీటీసీగా తనపై పోటీ చేసి ఓటమిపాలైన ప్రత్యర్థి, కాంగ్రెస్ నాయకుడు గౌస్ రబ్బానీకి రాష్ట్రస్థాయిలో ఏదైనా పదవి ఇవ్వాలని డిప్యూటీ సీఎంకు సూచించారు. 2006లో తన వెంట ఉన్న అనుచరులు, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులతో ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి ఆత్మీయంగా పేరుపేరునా పలకరించారు.

**'హృదయాల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకుంటా'**

హైదరాబాద్: ప్రజాప్రతినిధిగా ఎన్నికై 20 ఏళ్లవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శనివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. "లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా.. తరగని మధుర జ్ఞాపకం.. ఈ రెండు దశాబ్దాల ప్రజాజీవితం. నాడు మిడ్జిల్‌లో రేవంత్‌రెడ్డిగా మొదలై.. నేడు మీ అందరి గుండెల్లో రేవంతన్నగా నిలిచేవరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ప్రత్యేక అధ్యాయం. ఇదే స్ఫూర్తితో రేవంతన్నగా మీ హృదయాల్లో నా స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇస్తున్నాను" అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# రౌడీ రాజకీయం.. (మొదటిపేజీ తరువాయి)

"కేంద్రం చట్టం చేసిన తర్వాత రాజధానిని మార్చడం సాధ్యం కాదు. వాటికన్ తరహాలో మావిగన్ కావాలని గొడ్డలి పార్టీ మాట్లాడుతోంది. గొడ్డలి పార్టీ అని మేం చెప్పడం కాదు. వాళ్లే అంగీకరిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రజల భూముల్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే, మేం వివాదాస్పద భూముల సమస్యలను పరిష్కరిస్తున్నాం. శెట్టిపల్లె, వట్టిచెరుకూరు భూముల సమస్యలకు పరిష్కారం చూపాం. టీటీడీ నిధులు రూ.34 కోట్లతో కుప్పంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తాం. తిరుమలలో గత పాలకమండలి కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బ తీసింది. కూటమి ప్రభుత్వం దాన్ని అరికట్టింది" అని చంద్రబాబు వివరించారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటల్ని ప్రోత్సహించి రాయలసీమను అభివృద్ధి చేస్తామని, దీనికి వచ్చే నెలలో మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామన్నారు. సీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, అభివృద్ధే అజెండాగా మారిందని తెలిపారు. "కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించాం. ఇప్పుడు దేశంలో బంగారం సరఫరా చేసే వాటిల్లో కేజీఎఫ్ తర్వాత జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ పేరే వినిపిస్తోంది. కుప్పంలో కూడా బంగారు గనులు ఉన్నాయని చెప్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని అందుబాటులో తెచ్చి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాం. మైక్రో ఇరిగేషన్‌లో కుప్పం దేశానికే ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రానికి అది శ్రీరామరక్షగా మారింది" అని సీఎం వివరించారు.

**నెట్ జీరో విధానం ఇళ్ల సందర్శన**

తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు తొలుత నలగంపల్లెలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తున్న ఇళ్లను సందర్శించారు. సోలార్ రూఫ్‌టాప్, ఇండక్షన్ కుక్ట్ల?పలు, వర్షపునీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నెట్‌జీరో విధానాన్ని విజయవంతంగా అమలుచేస్తున్న నలగంపల్లె గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలని అధికారులకు సూచించారు. అనంతరం కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ఆయన ప్రారంభిచారు. ఆ తర్వాత కుప్పం టీడీపీ కార్యాలయానికి వెళ్లి అక్కడ అమలవుతున్న 'జన నాయకుడు' పోర్టల్ పనితీరు గురించి తెలుసుకున్నారు. పోర్టల్ సిబ్బందితో మాట్లాడారు. కుప్పంలో ఫుడ్ స్ట్రీట్- ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాజాను ప్రారంభించి నిర్వాహకులతో మాట్లాడారు. కాగా, శనివారం రాత్రి తన నివాసంలో స్వర్ణ కుప్పం విజన్-2029 మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై అధికారులు, ఐఐటీ కాన్పూర్ బృందంతో సమావేశమయ్యారు. కుప్పం సమన్వయ కమిటీతో పాటు పార్టీ నాయకులతో వేర్వేరు సమావేశాల్ని నిర్వహించారు.

**ఆరు దశాబ్దాల పట్టా కల సాకారం**

ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కుప్పం మండలం కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు సీఎం చంద్రబాబు తెర దించారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు అందించారు. కంగుందిలో నిర్వహించిన డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మొత్తం 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అడవి పోరంబోకు భూమిని అసెస్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు క్యాబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రౌడీయిజం, గూండాయిజానికి రాష్ట్రంలో తావు లేదని, గత ప్రభుత్వ హయాంలో అనేక భూవివాదాలు సృష్టించారని, ప్రజల పట్టాదారు పాసుపుస్తకాలపై ఫొటోలు ముద్రిస్తే, తాను వాటిని తొలగించి రాజముద్రతో అందజేశానని సీఎం గుర్తుచేశారు. భూవివాదాల పరిష్కారంలో ఓపికతో వ్యవహరించి అన్ని రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భూములకు భద్రత కల్పించేందుకు సాంకేతికత జోడిస్తున్నామని చెప్పారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కూడా అనేక భూములు వివాదాస్పదమవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు, సోదరీమణుల హక్కులను గౌరవించాలని సూచించారు.

# అమ్మా.. ఎక్కడున్నావ్?

**కూలీ పనికి వెళ్లి తల్లి మిస్సింగ్**

**25 రోజులుగా అల్లాడుతున్న ఇద్దరు కూతుళ్ల**

**తండ్రి కూడా లేకపోవటంతో ఎవరిని అడగాలో తెలియక కన్నీళ్లు**

**బషీరాబాద్ పీఎస్‌లో కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**బషీరాబాద్, జూలై 4**



బిడ్డలు ఆడినా.. అల్లరి చేసినా అమ్మ నీడలోనే.. అమ్మ కాసేపు కనిపించకపోతేనే బిడ్డలు అల్లాడిపోతారు. అలాంటిది 25 రోజులుగా అమ్మ జాడ తెలియకపోతే ఆ బిడ్డల పరిస్థితి ఎలా ఉంటుంది..? అసలే తండ్రి లేడు.. అమ్మ ఎక్కడ ఉందో, ఏమైందో తెలియదు. ఆకలైతే ఎవరిని అడగాలో, రాత్రి అయితే ఎవరిని ఆశ్రయించాలో అర్థం కాక ఆ బిడ్డలు తల్లడిల్లి పోతున్నారు. 'అమ్మా.. ఎక్కడున్నావ్? త్వరగా ఇంటికి రా' అని నిత్యం కన్నీళ్లతో ఎదురుచూస్తున్నారు. ఆ చిన్నారుల ఆక్రందన జీవన్గి గ్రామంలో అందరినీ కంటతడి పెట్టిస్తోంది. రంగారెడ్డి జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన ఎనుముల మహేశ్వరి (35) కూలీ పని కోసం జూన్ 8న వికారాబాద్ వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమెకు భర్త లేడు. ఇద్దరు కుమార్తెలు అలకనంద (10), భువనేశ్వరి (12) ఉన్నారు. తల్లి జాడ తెలియకపోవటంతో ఆ బాలికలు కన్నీరుమున్నీరవుతున్నారు. మహేశ్వరి సోదరుడు వీరన్న ఫిర్యాదు మేరకు బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహేశ్వరి మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కాల్ డేటా ఆధారంగా సంగారెడ్డి జిల్లాకు చెందిన బెంజమిన్ అనే వ్యక్తిని విచారించారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో తనకు ఆ ఫోన్ దొరికిందని చెప్పటంతో ఈ కేసుతో అతనికి సంబంధం లేదని తేల్చారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో కొందరు వ్యక్తులు ఒక మహిళను బలవంతంగా తీసుకెళ్లటం కొందరు చూసినట్లు విచారణలో తెలిసింది. దీంతో తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ విఠల్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. త్వరలోనే మహేశ్వరి ఆచూకీ కనుగొంటామని పోలీసులు భరోసా ఇస్తున్నారు.

# ద్వితీయం అద్వితీయమే

**వైద్య చికిత్స కోసం సెకండ్ ఒపీనియన్ ఎప్పుడూ మంచిదే**

**హైదరాబాద్ సిటీ, జూలై 4**

వైద్యులను సంప్రదిస్తున్నవారిలో చాలామంది ఇప్పుడు సెకండ్ ఒపీనియన్‌కు ఆసక్తి చూపుతున్నారు. చికిత్స గురించి వైద్యుడి సూచనలను రోగి గుడ్డిగా నమ్మడం లేదు. మరో వైద్యుడిని సంప్రదిస్తున్నాడు. కొందరైతే సెకండ్ ఒపీనియనే కాదు.. థర్డ్ ఒపీనియనూ తీసుకుంటున్నారు. ఆ తర్వాతే వైద్య చికిత్సపై నిర్ణయం తీసుకుంటున్నారు. రోగుల్లోని ఈ ధోరణిని వైద్యులు కూడా స్వాగతిస్తున్నారు కొన్నిసార్లు సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని వైద్యులే చెబుతున్నారు. రోగులు, వారి కుటుంబసభ్యుల్లోని ఆసక్తిని గమనించి కొన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా సెకండ్ ఒపీనియన్ కోసం ఉచిత కన్సల్టేషన్ డ్రైవ్‌ను చేపడుతున్నారు. బంజారాహిల్స్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో గతంలో ఉచిత సెకండ్ ఒపీనియన్ కన్సల్టేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. తాజాగా బేగంపేటలోని 'విన్‌విజన్ ఐ' ఆస్పత్రిలో రెండు నెలల నుంచి సెకండ్ ఒపీనియన్ ఉచిత కన్సల్టేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఇరవై మంది రోగులు సంప్రందించగా, వారిలో పది మందికి శస్త్రచికిత్స అవసరం లేదని నిర్ధారించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. చాలా మంది క్యాన్సర్, గర్భశాయ సంబంధ సమస్యలు, మోకాలి తుంటి మార్పిడి, కణుతులు తొలగించడం, నేత్ర సంబం??ధమైన ఇబ్బందులు, గుండె, న్యూరో సర్జరీలపై సెకండ్ ఒపీనియన్ కోసం ఆశ్రయిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. కాగా సెకండ్ ఒపీనియన్ తీసుకోవడం వల్ల రోగులకు ఒక భరోసా ఏర్పడుతుంది. తొలుత తాము సంప్రదించిన వైదద్యుడి అభిప్రాయాన్ని, రెండో వైద్యుడి అభిప్రాయాన్ని బేరీజు వేసుకుని ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్ద శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చినప్పుడు, అరుదైన వ్యాధుల విషయంలో, క్యాన్సర్, గుండె, మెదడుకు సంబంధించిన వ్యాధులను గుర్తించినప్పుడు, మందులు వాడుతున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడనప్పుడు, వైద్య చికిత్సపై అనుమానాలు, సందేహాలు కలిగినప్పుడు సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సెకండ్ ఒపీనియన్ కోసం వెళ్లాల్సి వస్తే అన్ని వైద్య నివేదికలు, స్కాన్ల తాలూకు రిపోర్టులు, మందుల చీటీలు వెంట తీసుకెళ్లాలి. సంబంధిత విభాగంలో అనుభవం ఉన్న నిపుణుడిని సంప్రదించడం మంచిది.

# హిందువుల ఓట్లను తొలగించే కుట్ర

**సర్ పేరిట రాష్ట్ర సర్కారు అధికార దుర్వినియోగం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**జగిత్యాల, జూలై 4**

సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మజ్లి?సతో కాంగ్రెస్ కుమ్మక్కై హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని.. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదముం దన్నారు. శనివారం జగిత్యాల జిల్లా భీమారం మండలం దేశాయిపేటలో విలేకరులతో బండి సంజయ్ మాట్లాడారు. సర్‌పై కింది స్థాయి అధికారులు పనిచేయడానికి సుముఖంగా ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం సహకరించట్లేదని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో అధికారులు హిందువుల ఇళ్లకు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదన్నారు. తెలంగా ణలోని హిందువులంతా జాగృతం కావాలని, లేని పక్షంలో హిందువులంతా మైనారిట ీలయ్యే ప్రమాదముందని హెచ్చరి ంచారు. 'కొన్ని నగరాల్లో రోహింగ్యాల ఓట్లను తొల గిస్తే ఎంఐఎం అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. దానికి కాంగ్రెస్ వత్తాసు పలుకుతోంది. వారు రోహింగ్యాల ఓట్లతో గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జీతాలు, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలన్న పైసల్లేని దుస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ పాలనలో దోచుకున్న సొమ్మునంతా ఫాంహ చిసకు తరలిస్తే, కాంగ్రెస్ పాలనలో దోచుకు న్నదంతా ఢిల్లీ పెద్దలకు పంపుతు న్నారు. రాష్ట్రంలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతో ందంటే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల తోనే.. రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయట కు రావాలంటే డబుల్ ఇంజన్ సర్కారు రావా ల్సిందే..' అని సంజయ్ వ్యాఖ్యానించారు.

# టీఆర్ఎస్ పేరు ఇవ్వలేం..

**(మొదటిపేజీ తరువాయి)**

తాను అప్పటికే తెలంగాణ రాజ్యసమితి (టీఆర్ఎస్) పేరుతో పార్టీ పెట్టానని, అందువల్ల టీఆర్ఎస్ అన్న సంక్షిప్త నామంతో మరో పార్టీ ఉంటేఇబ్బంది అవుతుందని తెలిపారు. అదేవిధంగా మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి మరో అభ్యంతరం వచ్చింది. ఈ రెండింటిపైనా కవిత ఎన్నికల సంఘానికి సమాధానం పంపారు. మొదట వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానమిచ్చామని, ఇప్పుడు చెబుతున్న 'అనేక అభ్యంతరాలు' ఏమిటో చెబితే వాటికి కూడా సమాధానం ఇస్తామని కవిత కోరినట్లు తెలిసింది. తమకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరే కావాలని స్పష్టంచేసినట్లు సమాచారం. పార్టీ పేరు విషయంపై వెనక్కితగ్గేది లేదని ఆమె తేల్చి చెప్పినటు కవిత సన్నిహిత వర్గాలు అంటున్నాయి. దీనిపై న్యాయపోరాటం చేస్తామని టీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పార్టీపై వచ్చిన ఫిర్యాదులు ఏంటో చెప్పకుండా పేరు మార్చుకోవాలని చెప్పడం సరికాదని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయి. ఈసీకి ఫిర్యాదులు వెళ్లటం వెనుక బీఆర్ఎస్ పార్టీ నేతల హస్తం ఉందని ఆరోపిస్తున్నాయి.

# మమతకు మరో షాక్..

**(మొదటిపేజీ తరువాయి)**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుంది. తమదే అసలైన టీఎంసీ అని ప్రకటిస్తూ ఓ సమావేశం కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రితబ్రతతో పాటు ఫిర్హాద్ హకీమ్, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, అఖ్రుజమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేయండి

**కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు**

**హైదరాబాద్, జూలై 4**



రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటే, దానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం, విద్య, తాగునీటి అంశాలపై శనివారం సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ... పంటల మార్పిడిపై రైతులను ఎప్పటికప్పుడు చైతన్యపరచాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. విద్యుత్తు అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన వంటశాలలకు తగిన స్థలాలను గుర్తించాలని తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వడి నర్సింగరావు జన్మదిన వేడుకలు






**మెటుపల్లి జులై 04**

జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని వై కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వడి నర్సింగారావు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ముందుగా బండలింగపూర్ శివారు గండి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వై కన్వెన్షన్ హాల్ లో వేడుకలకు హాజరయ్యారు కార్యక్రమంలో భాగంగా ధర్మపురి నరసింహస్వామి ఆలయ పూజారులు కోరుట్ల మెటుపల్లి పురోహితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు ముస్లిం మత పెద్దలు పుట్టినరోజు సందర్భంగా ప్రార్థనలు జరిపారు జగిత్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు మెటుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు మరియు పలు ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల అధికారులు కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు నర్సింగరావు పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ మరియు వార్డు మెంబర్లు రక్తదానాన్ని చేశారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు కోరుట్ల మెట్పల్లి మహిళా సంఘాల సభ్యులు పాల్గొని ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు

# దొడ్డి కొమరయ్య అమరత్వం వృధా కాదు

**రానున్న రోజుల్లో ఆయన ఆశయాల సాధన కోసం మరిన్ని పోరాటాలు నిర్వహిస్తాం**

**సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్**





**ఆర్మూర్ జూలై 04**

నిజామాబాద్ జిల్లా సిపిఎం ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రి నగర్ లో గల సిపిఎం కార్యాలయంలో దొడ్డి కొమరయ్య 80 వ వర్ధంతి సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయు రహితంగా పోరాటంలో రాజాకారులకు వ్యతిరేకంగా ఉండేవాడికే భూమి కావాలని భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ఆనాడు ముందుండి పోరాడిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు నల్గొండ జిల్లా కడివెండిలో అక్కడున్న దొరలు వివరించిన తీరుకు నిరసనగా భూమి పన్ను కట్టాలని ప్రజలను పీడిస్తున్న సందర్భంలో కట్టేది లేదని దున్నేవాడిదే భూమి అని మొట్టమొదటిసారిగా ఎదిరించిన దొడ్డి కొమరయ్యను ఆనాడు ఉన్న రజాకార్లు దొడ్డి కొమరయ్య గుండెలో కాల్పులు జరపడంతో దున్నేవాడిదే భూమి అని ఆంధ్ర మహాసభ జిందాబాద్ అనే నినాదాలు చేస్తూ అమరుడయ్యారని కొనియాడాలి . ఆయన స్ఫూర్తితో పేదల పక్షాన పేదలకు భూమిలో ఇళ్ల స్థలాలు వచ్చేవరకు పోరాటాలు ముమ్మరంగా నిర్వహిస్తామని అన్నారు. సిపిఎం ఆర్మూర్ పట్టణ కార్యదర్శి కూతడి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతన్న పోరాటానికి దిక్సూచి దొడ్డి కొమరయ్య అని రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడే తన ప్రాణాలను అడ్డు పెట్టాడని గొల్ల కులంలో పుట్టినప్పటికీ పేదల పక్షాన నిలబడే తన ప్రాణాలను త్యాగం చేస్తాడని అన్నారు కానీ నేటి పాలకులు , కులం పేరుతో మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఒకవైపు ధరలు పెంచుతూ ప్రజల పై భారాలు వేస్తున్నారే తప్ప ప్రజల కష్టాలు పట్టించుకున్న పాపాన పోవట్లేదు రానున్న రోజుల్లో దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పేదల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అప్పుడే ఆయన నిజమైన ఆశయాలు నెరవేర్చినట్టు అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు టీ భూమన్న డి రవి జనపల్లి నడిపి రాజన్న, యాట కనకయ్య, దండగల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి.. ఆయిల్ పామ్ సాగు విస్తరించాలి

**కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు**

**ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం**







**రాజన్న సిరిసిల్ల, జూలై 4**

రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తూ పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయాలని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను చైతన్యపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయం, ఎరువుల లభ్యత, ఫార్మర్ రిజిస్ట్రీ, వర్షాకాల వ్యాధుల నివారణపై సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. 2026--27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎస్ తెలిపారు. జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించి లక్ష్యాలను సాధించాలని, పంట మార్పిడితో పాటు కూరగాయల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎరువుల అక్రమ రవాణా, పక్కదారి పట్టింపును కఠినంగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేయాలని, దేశవ్యాప్తంగా తెలంగాణ 71.45 శాతం నమోదుతో తొలి స్థానంలో ఉందని పేర్కొంటూ అదే వేగాన్ని కొనసాగించాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్యం, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మర్రవ్వ ఆలయానికి నిధులు కేటాయించాలని కేంద్ర హోం శాఖ సహాయక మంత్రికి వినతి పత్రం



**కథలాపూర్,జులై 4**

కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ కథలాపూర్ మండలంలోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమలా ప్రారంభోత్సవంలో పాల్గొని బిజెపి శ్రేణులలో నూతన ఉత్సాహాన్ని నింపారు, ఇట్టి కార్యక్రమంలో భూషణరావుపేట గ్రామంలో గల మర్రవ్వ దేవాలయా అభివృద్ధికి నిధులు కేటాయించవలసిందిగా భూషణరావుపేట గ్రామ బిజెపి స్థానిక నాయకులు ఎడ్మాల వినోద్ రెడ్డి, తుమ్మనపల్లి మహేష్, బత్తిని నవీన్, బత్తిని శ్రీపతి, పల్లె గంగాధర్, కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ కి వినతి పత్రాన్ని సమర్పించారు, దానికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలియజేశారు.

## వృద్ధురాలుకు అండగా నిలుస్తాం.

**చైర్మన్ గోడిసేల సంధ్యారాణి..**



**రామకృష్ణాపూర్, జూలై 4, (మన సమాజం):**

మున్సిపాలిటీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 17వ వార్డుకు చెందిన వృద్ధ మహిళ పాశం భూధమ్మ ఇల్లు కూలిపోవడంతో మహిళకు అండగా నిలుస్తామని క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి హామీ ఇచ్చారు. వార్డులోని కూలిన ఇల్లును చెన్నూరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఎవరు లేని మహిళకు అండగా ఉండడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. నాయకులు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ నిరుపేదరాలైన మహిళకు నీడ లేకుండా పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ ఇంటి నిర్మాణం కొరకు ముందస్తుగా కావలసిన ఆర్థిక సహాయాన్ని భూదమ్మకు అందజేస్తామని తెలిపారు. మహిళకు సహాయ సహకారాలు అందించడానికి ముందుకొచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట కౌన్సిలర్ బబ్బర స్వర్ణలత, నాయకులు రామిడి కుమార్, లక్ష్మీకాంత్, మాజీ కౌన్సిలర్ ఉమాదేవి, స్థానికులు ఉన్నారు.

## నిరాశ్రాయురాలైన మహిళకు నిత్యావసర సరుకులు అందజేత..



**రామకృష్ణాపూర్, జూలై 4, (మన సమాజం):**

పట్టణంలోని 17వ వార్డుకు చెందిన వృద్ధురాలు పాశం భూదమ్మ ఇళ్ళు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్న కాస్త పాత ఇళ్ళు కూలి నిలువ నీడ లేకుండా అయ్యింది. నిరాశ్రయులైన మహిళను ఆదుకోవడానికి మందమర్రి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ముందుకు వచ్చారు. వృద్ధురాలికి నిత్యవసర సరుకులు అందజేసి ఇల్లు నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ మాట్లాడుతూ నాయకులు సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు వృద్ధురాలు అయిన బూదమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వృద్ధురాలికి సహాయం అందించాలని, అంతేకాకుండా మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, ఆవునూరి లక్ష్మి, తిరుమల, చోటు పాల్గొన్నారు.

## దేవస్థానం భూములపై ఉక్కుపాదం

**వేములవాడ, జూలై 4**

శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఆలయ అధికారులు మరోసారి అక్రమ ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపారు. శనివారం స్వామివారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ పరిధిలో దేవస్థానం స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డును ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం అధికారులు తొలగించారు.భీమేశ్వర ఆలయం సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ పక్కన దేవస్థానం భూమిని ఆక్రమించి దుకాణం నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ముందుగా పలుమార్లు నోటీసులు జారీ చేసి స్థలాన్ని స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని ఆదేశించారు.



## ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా

ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

## ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నా ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి

## ముసలిదానివి అయిపోతున్నావ్, పెళ్లి చేసుకోమన్న నెటిజన్..



సోషల్ మీడియాలో సెలబ్రిటీలపై ట్రోలింగ్ ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది. ముఖ్యంగా హీరోయిన్ల వయస్సు, పెళ్లి, వ్యక్తిగత జీవితాలపై తరచూ నెగెటివ్ కామెంట్లు వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ నటి షమితా శెట్టి కూడా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమె హుందాగా, ఘాటుగా ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో షమితా శెట్టిపై ఓ నెటిజన్ చేసిన కామెంట్ చర్చనీయాంశమైంది. "మీ వయస్సు పెరిగిపోయింది.. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పటికైనా పెళ్లి చేసుకోవచ్చు కదా" అంటూ అతను కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌ని చాలామంది సాధారణంగా పట్టించుకోకుండా వదిలేస్తారు. కానీ షమితా మాత్రం ఎంతో హుందాగా, అదే సమయంలో గట్టిగానే స్పందించారు. వయస్సుపై వచ్చిన విమర్శలకు స్పందించిన షమితా శెట్టి.. జీవితంపై తన పాజిటివ్ దృక్పథాన్ని వెల్లడించారు.అవును.. నా వయస్సు పెరుగుతోంది. దాంతో పాటు నాలో మార్పులు కూడా వస్తాయి. కాలంతో పాటు ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. శారీరక రూపురేఖలతో సహా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు అంటూ ఆమె పేర్కొన్నారు.అలాగే తాను ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా, ఫిట్‌గా, మానసికంగా సంతోషంగా ఉన్నానని స్పష్టం చేశారు. నా వయస్సుకు తగ్గట్లుగా నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. మానసికంగా ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నాను. అది నాకు చాలు అంటూ షమితా చెప్పిన మాటలు ఇప్పుడు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక పెళ్లిపై వచ్చిన కామెంట్‌కు షమితా ఇచ్చిన కౌంటర్ మరింత వైరల్ అవుతోంది.పెళ్లి చేసుకుని మీరేం సాధించారు? అంతగా పెళ్లై సెటిల్ అయ్యామని అనుకునే మీరు.. నాలాంటి సింగిల్ వ్యక్తులను సోషల్ మీడియాలో ఎందుకు ఫాలో అవుతున్నారు? మా జీవితాలపై మీకెందుకు అంత ఆసక్తి? అంటూ ట్రోలర్‌ను నేరుగా ప్రశ్నించారు.ఈ సమాధానంతో సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత జీవితాలపై అనవసర కామెంట్లు చేసే వారిపై ఆమె గట్టిగా స్పందించినట్లైంది.షమితా శెట్టి కామెంట్స్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తోంది. ముఖ్యంగా మహిళా అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.ఒక మహిళ పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం, వయస్సు పెరిగిందని ట్రోల్ చేయడం సరైంది కాదు, షమితా చాలా మెచ్యూర్‌గా సమాధానం ఇచ్చారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

